# పెట్రోల్ బంకుల్లో ట్యాంపరింగ్ ..

**-చిప్‌లతో వినియోగదారులను కుచ్చుటోపి**
**-10లీటర్లు పోయిస్తే వచ్చేది 9లీటర్లే**
**-అప్రమత్తం లేకుంటే జేబులకు చిల్లుపడినట్లే ..**

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:**
పెట్రోల్ బంకు నిర్వాహకులు సాంకేతిక మాయాజాలంతో సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నారు. ఎక్కడాలేని విధంగా యంత్రాలను టాంపరింగ్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ వచ్చేసమయంలో ముఖ్యంగా పనిచేసే పల్సర్‌లను ట్యాపరింగ్ చేయడం వల్ల 10లీటర్లు వచ్చేది 9లీటర్లే వస్తున్నట్లు తెలుస్తుంది. అనుమానం వచ్చినవాళ్లు పట్టిస్తే ప్రైవేట్ పంచాయితీల్లో నయానో బయానో చెల్లించి మెప్పిస్తున్నారు. దీంతో సామాన్యుడి జేబులకు లక్షల్లో చిల్లులు పడుతున్నాయి. హయత్‌నగర్‌లోని ఓపెట్రోల్ బంకులో ఘరానా మోసం చోటు చేసుకుంది. తన కారు పెట్రోల్ ట్యాంక్ సామర్థ్యానికి మించి పెట్రోల్ బిల్లు వేశారని వినియోగదారుడి ఆరోపించాడు. తన కారు పెట్రోల్ ట్యాంక్ సామర్థం 27 లీటర్లు అయితే 32 లీటర్ల పెట్రోల్ పోసినట్లు రసీదు ఇచ్చారని వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. బంకు యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే ఇటీవల ఓపెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. తక్కువ పెట్రోల్ వచ్చేలా ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించారని, చిప్‌లను పెట్రోల్ బంకుల్లో అమరుస్తున్నారని చెప్పారు. నిందితులంతా గతంలో పెట్రోల్ బంకుల్లో పనిచేసారని, బంకు యజమానులు నిందితులు కుమ్మకయ్యారని వెల్లడించారు. చిప్‌ల ఏర్పాటుతో లీటరకు 30 నుంచి 50లీటర్లు తక్కువ వస్తుందని తెలిపారు. ఇలా మూడు రాష్ట్రాల్లోని 34 బంకుల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు.

### పల్సర్లలో మార్పులు..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం నగరంలో కొంత మంది డీలర్లు తమ జేబులు నింపుకోవడానికి వినియోగిస్తున్నారు. ఈమోసాలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడం ఉత్తమం. పెట్రోల్ పోసే యంత్రంలో పల్సర్ల ఉంటాయి. ఇవి పెట్రోల్ పోసే వర్కర్లు నిర్దేశించిన విధంగా పెట్రోల్ విడుదల చేస్తాయి. పెట్రోల్ విడుదల చేయడంతో పల్సర్లదే కీలక పాత్ర. అయితే వీటిపైనే కొందరు అక్రమార్కులు దృష్టి సారించారు. ఈపల్సర్ల మార్పులు,చేర్పులు చేసి పది లీటర్ల పెట్రోల్ కొట్టిస్తే తొమ్మిది లీటర్లే బయటికి వచ్చే విధంగా ట్యాంపరింగ్ చేస్తున్నారు. బయటికి కనిపించే మీటరు రీడింగ్ మాత్రం పది లీటర్ల ఉంటుంది. నగదు సైతం అదే పది లీటర్లకు చూపిస్తుంది. ఎక్కువ మొత్తంలో కొట్టించుకునే క్రమంలో ఈ రకమైన మోసాలకు డీలర్లు తెరతీస్తున్నారు.. ప్రధానంగా పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు ఉన్న ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నాయి. నగరంలోని చాలా బంకులపై ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి. చాలా బంకుల్లో ఖాళీ సీసాల్లో పెట్రోల్ కొట్టమంటే కొట్టకపోవడంతో టాంపరింగ్ చేస్తున్నట్లు ఆయా బంకులపై అనుమానాలున్నాయి. పెట్రోల్,డీజిల్ కొట్టేందుకు ఒకటే మిషన్ ఉండగ అందులో కేవలం పెట్రోల్ లేదా డీజిల్ నాజిల్స్‌ను మాత్రమే వినియోగిస్తున్నారు. దీనికి కారణం పల్సర్స్‌లో టాంపరింగు చేయడం వీలు కాదని వినియోగదారులు గుర్తించే అవకాశముంటుందని ప్రత్యేకంగా డీజీల్ లేదా పెట్రోల్ నాజిల్‌లో ఉపయోగించే చోటే పల్సర్లను మారుస్తున్నట్లు సమాచారం. ఈ మోసాలను గుర్తించి ఆందోళన చేసిన సమయాల్లో ప్రైవేట్ పంచాయితీలు పెట్టి పరిహారం చెల్లించడంతో వివాదాలు కనుమరుగవుతున్నాయి.

### అనుమానం వస్తే అక్కడే చెక్ చేసుకోవచ్చు...

మీరు పెట్రోల్ డీజిల్ కొట్టించేటప్పుడు తక్కువ వచ్చినట్లు అనుమానం వస్తే వెంటనే అదే పెట్రోల్ బంకులో చెక్ చేసుకోవచ్చు. అందుకోసం బంకుల్లో 5లీటర్ల క్యాన్లు అందుబాటులో ఉంటాయి. వాటిలో పోసి చూసుకొని ఎంత వస్తుందో చూడాలి. తక్కువగా వస్తే సదరు పెట్రోల్ బంకు పరిధిలోని తూనికలు కొలతల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అంతే కాకుండా ఫ్యూయల్ నాణ్యంగా లేకపోయినా, నాసీరకంగా ఉన్నా అదే పెట్రోల్ బంకులో ఫిల్టర్ పేపర్ టెస్ట్ ఉంటుంది. దాన్ని కూడా మీరు అడిగి చేయించుకోవచ్చు. ప్రతి పెట్రోల్ బంకుల్లోనూ ఈరెండు టెస్ట్‌లను ఉచితంగా చేస్తారు. ట్యాంపరింగ్‌తో వినియోగదరులను నిలువునా దోచుకుంటున్న వ్యాపారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# హైదరాబాద్ వార్త

# సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల కట్టడిపై ప్రత్యేక దృష్టి

**-క్వాలిటీ ఆఫ్ పోలీసింగ్, ట్రాఫిక్ క్రమబద్దీకరణకు పెద్దపీట**
**:మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి**

**హైదరాబాద్, మే 1 ప్రభాతవార్త**
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారిణి బి. సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరికి మొదటి మహిళ పోలీస్ కమిషనర్‌గా నియమించడం ఆనందంగా బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ప్రజలకు అత్యంత పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమని సీపీ సుమతి పేర్కొన్నారు. మల్కాజిగిరి కమిషనరేట్‌కు ప్రశాంతమైన ప్రాంతంగా మంచి పేరుంది. ఆ ఖ్యాతిని కాపాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తామని సీపీ తెలిపారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బాధితులకు సమాచార పూరిత త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సమాజానికి పెను సవాలుగా మారిన మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రివెన్షన్, డిటెక్షన్ ఎఫెక్టివ్ ఇన్వెస్టిగేషన్ పై దృష్టి పెడతామనీ ఆమె హెచ్చరించారు. యువత మత్తుకు బానిస కాకుండా ఆధారిత నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా పోలీస్ కమిషనర్‌గా నన్ను నియమించిన ప్రభుత్వానికి, సహకరించిన డీజీపీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకతతో మా టీమ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని సీపీ సుమతి అన్నారు.

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.సుమతి

# నివాసాలు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్ రూం

**బాధితులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:**
పేదవారిపేరుతో కబ్జాదారులు చేసే దుష్ప్రచారానికి ప్రభుత్వం చెక్ పెడుతోంది. పేదవారిని ముందు పెట్టి కబ్జాలకు పాల్పడే బడాబాబుల భరతం పడుతూనే బాధితులకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. చెరువులను పునరుద్ధరిస్తున్న క్రమంలో నివాసాలు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు నిర్ణయించారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మాధాపూర్‌లోని సున్నం చెరువుతో పాటు ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ చెరువులో నివాసాలు కోల్పోయిన వారితో హైడ్రా కమిషనర్ శుక్రవారం సమావేశమయ్యారు. చెరువుల పునరుద్ధరణలో నివాసాలు కోల్పోయిన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని సిఎం నిర్ణయించారని బాధితులకు తెలిపారు. ఈ మేరకే చెరువు పరిధిలో ఎన్ని గుడిసెలు ఉన్నాయి.. ఎంత మంది నివాసం ఉంటున్నారనే విషయాలపై పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్నారు. త్వరలోనే అందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తుందని అవకతవకలకు ఆస్కారం లేకుండా..గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఈ జాబితాను సిద్ధం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. 2024 జులై 19వ తేదీకి ముందు నివాసం ఉన్నవారి లెక్కలు సేకరిస్తున్నామన్నారు. నగరంలో చెరువులను పునరుద్ధరించిన అన్ని చోట్ల ఇదే విధానాన్ని అనుసరించాలని సిఎం సూచించారని తెలిపారు. పేదవారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలనేదే ప్రభుత్వ సంకల్పమని జీవనోపాధికి నగరానికి వచ్చి చెరువుల చెంత గుడిసెలు వేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి విషయంలో ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉందన్నారు. ఎక్కడి నుంచి వచ్చారు.. ఏం చేస్తున్నారనే విషయాలను బాధితులను హైడ్రా కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నల్గొండ, నాగర్‌కర్నూలు, దేవరకద్ర, మహబూబ్‌నగర్, ఆంధ్రాలోని పలు జిల్లాలతో పాటు పరిగి, తాండూరు ప్రాంతాలకు చెందిన వారిగా బాధితులు పరిచయం చేసుకున్నారు. చెత్త ఏరుకునేవారికి ఎక్కడా ఇళ్లు అద్దెకు దొరకని పరిస్థితుల్లో చెరువుల చెంత చేరామని బాధితులు ఈ సందర్భంగా తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టమైన ఆధారాలతో జాబితాను సిద్ధం చేయాలని ఈ సందర్భగా అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

నివాసాలు కోల్పోయిన బాధితులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# గాంధీలో మదర్ మిల్క్ బ్యాంక్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ప్రారంభం

**సికింద్రాబాద్, మే1 ప్రభాతవార్త:**
గాంధీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించారు.ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌లో ఉండే వివిధ విభాగాలు, వాటి పనితీరును డాక్టర్లు మంత్రికి వివరించారు. ఉస్మానియాలో 18 నెలల చిన్నోడిని సక్సెస్‌ఫుల్‌గా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసిన ఉస్మానియా గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ, డాక్టర్ మధుసూదన్‌ను మంత్రి ఈసందర్భంగా సన్మానించారు. గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో ఐవీఎఫ్ చేయించుకుని అక్కడే కవల పిల్లలకు జన్మనిచ్చిన దంపతులను కలిసి వారికి మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులు తమ సంతోషాన్ని మంత్రితో పంచుకున్నారు. ప్రభుత్వానికి, డాక్టర్లు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. గాంధీ ఐవీఎఫ్ సెంటర్ హెడ్, డాక్టర్ శోభ, ఇతర డాక్టర్లు సిబ్బందిని అభినందించిన మంత్రి, వారిని సన్మానించారు. అనంతరం గాంధీ మెడికల 68వ బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని, విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వైద్య వృత్తి అనేది ఒక ఉద్యోగం కాదని, జీవితాంతం మానవసేవకు అంకితమయ్యే కర్తవ్యమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఈ వృత్తి ప్రధాన లక్ష్యమని తెలిపారు. గాంధీ హాస్పిటల్‌లో మదర్ మిల్క్ బ్యాంక్‌ను కూడా ఈరోజు ప్రారంభించుకున్నామని చెప్పారు. రోజుకు 30 నుంచి 40 వరకు ప్రసవాలు జరుగుతున్న ఈ ఆసుపత్రిలో, శిశువులకు తల్లి పాలు అందుబాటులో లేకపోయిన సందర్భాల్లో ఈ బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుంది చెప్పారు. అదే విధంగా 10 పడకలతో సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్, డీఅడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల బారిన పడిన వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రస్తుతం రాష్ట్రంలో 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. గత రెండేళ్లలో కొత్తగా 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని చెప్పారు. కాలేజీలు ఏర్పాటు చేయడమంటే జీవోలు ఇచ్చి వదిలేయలేని, ప్రతి కాలేజీలో, ప్రతి హాస్పిటల్‌లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. లాభం మాత్రమే లక్ష్యంగా కాకుండా, రీజనబుల్ చార్జీలతో నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో మీరు ముందుకు సాగుతారని అకాంక్షిస్తున్నాను.కార్యక్రమంలో ఎమ్మెల్సీ, డాక్టర్ బల్మూర్ వెంకట్, హెల్త్ యూనివర్సిటీ వీసీ రమేశ్ రెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరా, సూపరింటెండెంట్ వాణి తదితరులు పాల్గొన్నారు

ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి

# ఎర్లీబర్డ్ ద్వారా రూ.260.23 కోట్ల ఆస్తి పన్ను వసూలు

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎర్లీబర్డ్ ఆస్తి పన్ను వసూళ్లు ఆశాజనకంగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆదాయం వృద్ధి చెందింది. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 30 వరకు ఎంఎంసీలో అమలు చేసిన ఎర్లీబర్డ్ పథకాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకున్నారు. అయితే గత సంవత్సరం (2025-26)లో ఈ పథకం ద్వారా రూ. 240.2 కోట్లు వసూలైతే ఈ సంవత్సరం (2026-27)లో రూ.260.23 కోట్లు వసూలు కావడం విశేషం. గత సంవత్సరం కంటే ఈ ఏడాది రూ. 20.06 కోట్లు అధికంగా వసూలైంది. అలాగే గతేడాది కంటే దాదాపు 8.34 ఎర్లీ బర్డ్ పథకం ద్వారా ఆస్తిపన్ను వసూళ్లు పెరిగాయి. పన్ను చెల్లింపుదారుల బాధ్యతాయుత స్పందన, సమయపాలనతో పాటు కార్పొరేషన్ చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, సమర్థవంతమైన వసూళ్ల యంత్రాంగం ఈ ఫలితాలకు దోహదపడ్డాయి. ఈ సందర్భంగా ఎంఎంసి వినయ్ క్రిష్ణారెడ్డి,రెవెన్యూ అదనపు కమిషనర్ రాధికా గుప్తా, సంబంధిత సిబ్బంది కృషిని అభినందిస్తూ, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు.మిగిలిన పన్ను చెల్లింపుదారులు కూడా తమ ఆస్తి పన్నును చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

**దోమల నివారణకు పటిష్ట చర్యలు...**

దోమల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అన్నోజిగూడ, పోచారం, హిమగిరికాలనీ, జోడిమెట్ల మిరాలం చెరువు, నాగారం శిల్పానగర్ పార్కు, దయారకుంట చెరువు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. అన్నోజిగూడలో పర్యటించిన కమిషనర్ పోచారం హిమగిరి కాలనీలో ఇంటి పరిసరాల్లో దోమల లార్వా నియంత్రణకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమం ప్రాముఖ్యతను స్థానికులకు వివరించారు. ఈ ప్రాంతంలో ఉన్న దోమల పెరుగుదల హాట్‌స్పాట్స్‌ను పరిశీలించి, ఎంటమాలజీ విభాగం ద్వారా ఎఎల్‌ఓ ఆపరేషన్లు, ఆయిల్ బాల్స్ వినియోగం, రసాయన స్ప్రేయింగ్‌ను మరింత వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. జోడిమెట్ల ,మిరాలంచెరువు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. దోమల లార్వా పెరుగుతున్న పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



జోడిమెట్ల,మిరాలంచెరువు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తున్న కమిషనర్

# ముమ్మరంగా 'ప్రతిరోజు ఒకవార్డు' కార్యక్రమం

**హైదర్‌నగర్‌లో పర్యటించిన సిఎంసి కమిషనర్ సృజన**

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:**
ప్రతిరోజు ఒకవార్డు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన కూకట్‌పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ హైదర్‌నగర్ వార్డులో క్షేత్రస్థాయి పర్యటించారు. ఈపర్యటనలో భాగంగా రామ్ నరేష్ నగర్, ప్రశాంత్ నగర్, ఏఎస్ రాజు నగర్ ఆలీ తలాబ్ చెరువులను సందర్శించారు. స్థానిక నివాసితులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో సమస్యలను సమీక్షించారు.ఈసందర్భంగా రామ్ నరేష్ నగర్ (రోడ్ నెం.1)లో రోడ్డు పనులను అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని మురుగునీటి కాల్వల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. అలాగే అసంపూర్తి ,నాసిరకం రోడ్డు పునరుద్ధరణ పనులపై పెనాల్టీలు విధించాలని ఆదేశించారు. అలాగే రోడ్ నెం.3లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, అంతర్గత రహదారులపై వదిలివేసిన పాత వాహనాలను క్లియర్ చేయాలని సూచించారు. నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుని ఆలీ తలాబ్ చెరువు అభివృద్ధి చెరువులోకి మురుగునీరు చేరకుండా మళ్లించాలని సూచించారు. .చెరువు గట్టు పటిష్టం చేయడం మరియు వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని చెరువు మెరుగైన నిర్వహణ కోసం "లేక్ కమిటీ"ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 99 రోజుల కార్యాచరణ కింద జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

హైదర్‌నగర్‌లో పర్యటిస్తున్న సిఎంసి కమిషనర్ సృజన

# బేగంపేట పరిధిలో భారీ సైబర్ మోసం

**-వాట్సప్‌లో మెసేజ్ పంపి 40.08లక్షలు కాజేసిన ఘటన.ఆలస్యంగా వెలుగులోకి.**

**బేగంపేట మే1,ప్రభాతవార్త :** బేగంపేట పరిధిలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది.వాట్సప్‌లో కంపెనీ మేనేజింగ్ డైరక్టర్ పేరుతో నకిలీ మెసేజ్‌లు పంపించి,ఓ ప్రయివేటు సంస్థ ఫైనాన్స్ మేనేజర్‌ను మోసగించి అతని వద్ద మొత్తం 40.08లక్షల రూపాయిలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఓ అండ్ ఎస్ రత్నా అల్యూమినియం ఫ్యాబ్రికేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఫైనాన్స్ మేనేజర్ గా పనిచేస్తున్న ఏ.కే.ఎన్.రామచంద్రరావు గురువారం బేగంపేట పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేసారు.ఏప్రిల్ 28న సంస్థ మేనేజింగ్ డైరక్టర్ జీ.ఆనంద్ పేరుతో వాట్సప్ నంబరు నుంచి అత్యవసరంగా నగదు బదిలీ చేయాలని మెసేజ్‌లు వచ్చాయి.వాటిని నిజమని నమ్మిన ఫైనాన్స్ మేనేజర్ నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ 36.80లక్షలు బదిలీ చేసారు.తరువాతి రోజు అదే నంబర్ నుంచి మరో సారి రూ3.28లక్షలు పంపాలని సూచనలు రావడంతో మరో సారి నగదు ట్రాన్స్‌ఫర్ చేసారు.తర్వాత అసలు మేనేజింగ్ డైరక్టర్ ను సంప్రదించగా ఆ మెసేజ్‌లు తను పంపలేదని తెల్సింది.నకిలీ నెంబర్ ద్వారా మోసగాళ్లు ఈ వ్యవహారం నడిపినట్లు బయటపడింది.మొత్తం రూ 40.08లక్షలు మోసపోవడంతో విషయం గుర్తించిన బాధితుడు బేగంపేట పోలీసులను ఆశ్రయించాడు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీలో నిబంధనలు తప్పక పాటించాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా**

జిల్లా పౌరసంబంధాల అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రియాంక ఆల

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:**
అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఈమేరకు శుక్రవారం నూతనంగా ఏర్పడిన డిస్ట్రిక్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పడిన కమిటీకి జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కమిటీ సమావేశాలకు తప్పక హాజరుకావాలని అలాగే కమిటీ పూర్తిగా సహకరించాలని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో వివిధ కేటగిరీల కింద అక్రిడిటేషన్ దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో అందడంతో విడతల వారీగా పూర్తిస్థాయిలో పరిశీలన చేసి జర్నలిస్టులకు కార్డులు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకర్ శిగ, నవీన్ కుమార్ యారా, మొహమ్మద్ రఫీ యుద్దీన్ ఘోరీ , కొమ్ము రాజు, మన్సూర్ అలీ, మహారధి దయానంద్, ఎంజి ప్రతిభ, ప్రణీత, మోహనా చారి, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ బాబూ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సిఎంసిలో పెరిగిన ఆస్తి పన్ను

**గతేడాదితో పోలిస్తే 70.48కోట్లు అధికం**

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి "ఎర్లీ బర్డ్" ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన వృద్ధిని సాధించింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పన్ను వసూళ్లు ఆశాజనకంగా పెరిగాయి. ప్రస్తుత సంవత్సరం 510.33 కోట్లు వసూళ్లు కాగా గత సంవత్సరం వసూళ్లు 439.85 కోట్లు అసూలైంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి70.48 కోట్లు అదనంగా వసూలయ్యాయి. ఇది సుమారు 16 శాతం వృద్ధిని నమోదు చేసింది.పన్ను చెల్లింపుదారుల చురుకైన భాగస్వామ్యం,కార్పొరేషన్ యొక్క ఆదాయ సమీకరణ ప్రయత్నాల వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి కమిషనర్ సృజన తెలిపారు.ఈ వసూళ్ల ప్రక్రియలో సమర్థవంతంగా పనిచేసిన సంబంధిత అధికారులు సిబ్బందిని కమిషనర్ అభినందించి రాబోయే కాలంలో కూడా ఇదే పనితీరును కొనసాగించాలని కోరారు

# ఆత్మహత్యకు పాల్పడిన టెకీ కేసులో బయటపడుతున్న వాస్తవాలు

**-భర్త మృతి చెందిన నెలకే ప్రియుడిని వివాహం చేసుకున్న భార్య**
**-ఆరుగురితో ప్రేమాయణం... ముగ్గురితో వివాహేతర**

**బేగంపేట మే 1,ప్రభాతవార్త**
మూడుముళ్ల బంధం తో ఒక్కటైన జంట జీవితాంతం వెంట నడుస్తానంటూ చేసుకున్న ప్రమాణాలు.అగ్ని సాక్షిగా పెద్దలు.కుటుంబ సభ్యుల వేసిన అడుగులను మర్చిపోయిన టెకీ సీతారామ్ భార్య రేణుక విచ్చల విడి శృంగారంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సీతారామ్ జీవితం మధ్యలోనే ఆత్మహత్యకు పురికొల్పి జీవితానికి ముగింపు పలికింది.ఈ సంఘటన ఒక్కసారిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్కాపురానికి చెందిన సీతారామ్,నంద్యాలకు చెందిన రేణుకను 2018లో వివాహం చేసుకున్నాడు.వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు.ఉద్యోగ రీత్యా వీరిద్దరూ బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు.అయితే తన భార్య రేణుక వ్యవహారంపై కుంగిపోయిన సీతారామ్ ఫిబ్రవరి లో హుస్సేన్ సాగర్ లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.భర్త పోయిన నెల తిరక్కుండానే మార్చిలో రేణుక తన ప్రియుడు ను వివాహం చేసుకోవడం ఇరు కుటుంబాలను, సమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది.ఆరుగురితో ప్రేమాయణం నడిపిన ఆమె ముగ్గరితో వివాహేతర సంబంధం కూడా కొనసాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడటం అందరినీ నివ్వెర పర్చింది.ఆత్మహత్యకు ముందు సీతారామ్ 19పేజీల సూసైడ్ నోట్ రాసి స్టేటస్ పెట్టడంతో పోలీసు విచారణకు అది కీలకంగా మారింది.ఆమె శృంగారంలో ఉండగా తీసిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం,దాని గురించి సహోద్యోగులు,ఇతరులు సీతారామ్‌ను ఆరాతీయడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సీతారామ్ హుస్సేన్ సాగర్‌లో దూకి ప్రాణాలు తీసుకున్నాడు.ఈ ఘటన జరిగిన నెల రోజులు తిరక్కముందే ప్రియుడిని వివాహం చేసుకోవడం ప్రతి ఒక్కరినీ నివ్వెర పర్చింది.రేణుక ప్రవర్తన కారణంగా సీతారామ్ ఆత్మహత్య చేసుకోగా అతని కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతుంది.ఎదిగిన కుమారుడు జీవితం మధ్యలోనే ముగిసి పోవడం,ఇద్దరు పిల్లలను అంధకారంలోకి నెట్టివేసిందని,రేణుక చేసిన తప్పులు ఇద్దరు చిన్నారుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చింది.తన కొడుకు మరణానికి కారణమైన వారిపై ఇంకా కఠిన చర్యలు తీసుకోకపోవడం ఏంటని సీతారాం తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వివాహేతర సంబంధాలతో తన కుమారుడి జీవితం అర్థాంతరంగా ముగిసిందని వారు ఆరోపిస్తున్నారు.అయితే ఈ కేసులో పోలీసులు విచారణ జరుపుతున్న క్రమంలో రేణుక అరాచకాలు ఎన్నో బయట పడుతుండటం,అసలు కేసు ముగింపు ఎలా ఉంటుందో అని రెండు తెలుగు రాష్ట్రాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## నిర్దోష్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు

### - కొత్తవాటికి దరఖాస్తుల స్వీకరణ

**చాంద్రాయణగుట్ట, మే 1, ప్రభాతవార్త :** మండు వేసవిలో ప్రజల మంచినీటి దాహార్తిని తీర్చేందుకు నిర్దోష్ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను (మంచినీటి కేంద్రాలు) ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రామ్‌కుమార్ తివారి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ తివారి మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లు, బస్‌స్టాపులలో గత సంవత్సరం 27, ఈ యేడు 30కి పైగా ప్రదేశాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దాదాపు మూడున్నర నెలల పాటు బాటసారులు, విద్యార్థుల దాహాన్ని తర్చునున్నట్లు వివరించారు. కొత్తగా చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. చలివేంద్రాల వద్ద పనిచేసే కార్మికులకు తమ సంస్థ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్, సైఫాబాద్, షాపుర్వాడి, గన్‌ఫౌండ్రీ, హకాభవన్, పబ్లిక్‌గార్డెన్, ఎల్.బి.స్టేడియం, గాంధీభవన్, అబిడ్స్, మహిళా కళాశాల, కోఠి, పోస్టాఫీస్, అఫ్జల్‌గంజ్, నల్గొండ క్రాస్ రోడ్డు, తగరీకానాఖ, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పురానాపుల్, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, ఎ.సి.గార్డ్స్, బంజారాహిల్స్, ఇ.ఎస్.ఐ, కంటి ఆసుపత్రి, ఎర్రగడ్డ, ముషీరాబాద్, నారాయణగూడ, ఫీవర్ ఆసుపత్రి, కాచిగూడ, ఉప్పల్ వంటి 30కి పైగా ప్రదేశాలలో త్రాగు నీటి స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సామాజిక సేవపై ఆసక్తి కలిగిన వారు తమ సహకారాన్ని అందించవచ్చన్నారు.

### ఫలక్‌నుమా కాళీమాత ఆలయంలో మహాజాతర

ఫలక్‌నుమా వంతెన వద్ద గల కాళీమాతను దర్శించుకుంటున్న భక్తులు

**చాంద్రాయణగుట్ట, మే 1, ప్రభాతవార్త :** పాతబస్తీ ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో గల కాళీమాత దేవాలయంలో శుక్రవారం అమ్మవారి మహాజాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ బొల్లు జగన్, అర్చకులు బొల్లు పవన్ ఆధ్వర్యంలో కాళీమాతకు ఉదయం అభిషేకం, అలంకరణ, విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం పోతరాజు నృత్యాలు, ఒగ్గు పూజల మధ్య అమ్మవారికి భక్తిప్రపత్తులతో బోనాలు సమర్పించారు. జాతర, లగ్నం నేత్రపర్వంగా సాగింది. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కాళీమాతను దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు, దారులు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పోలీసులు తగిన బందోబస్తు కల్పించారు.

### మధురానగర్‌లో దేవాలయ వార్షికోత్సవ వేడుకలు..

మునిరాతి రామకృష్ణను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్, మే 1, ప్రభాతవార్త:**
సంజీవరెడ్డి నగర్ పరిధిలోని మధురనగర్‌లో పుట్ట నాగమాత, జగదంబ మాత జగజ్జనని 20వ వసంత వార్షికోత్సవం సందర్భంగా భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు నవీన్ యాదవ్ శుక్రవారం ఆలయాన్ని సందర్శించి నాగలక్ష్మి మాత, శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులతో ఆయన సత్సంబాషణలు జరిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించి ప్రస్తుతం హైదరాబాద్ ఇంచార్జ్‌గా కొనసాగుతున్న మునిరాతి రామకృష్ణను ఎమ్మెల్యే నవీన్ యాదవ్ శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### అర్హులైన వారి ఓటుహక్కు పోకుండా చూడాలి : పవన్‌కుమార్ గౌడ్

సమావేశంలో పాల్గొన్న గుర్రం పవన్‌కుమార్ గౌడ్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**
జనగణన ప్రక్రియలో అర్హులైన వారి పేర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, ఇందుకోసం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పద్మారావునగర్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యదవ్ ఆదేశాల మేరకు బూత్ ఇంచార్జితో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో గుర్రం పవన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్‌కు ఒక బీఎల్‌వోను ఏర్పాటు చేశారని, బీఆర్ఎస్ బూత్ ఇంచార్జిలు వారితో పాటు సమన్వయం చేసుకొని ఓటర్ జాబితాను సరి చూసుకోవాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కుకూడా కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేతలు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఓటర్ జాబితాలో పేర్లను సరిచూచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సావిత్రి మహేష్. టి.ఆర్.ఎస్. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేశం రాజు. జనరల్ సెక్రెటరీ మహేందర్, వెంకట్ రమణ, గంధం శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, సురేష్, కొత్తూరు వెంకటేష్, శ్రీరాములు, ముక్క శీను, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## అఖిలభారత వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పండ్లు, మజ్జిగ పంపిణీ

పండ్లు, మజ్జిక పంపిణీ చేస్తున్న వేముల లోకేష్, గోగుల స్వామి, మక్కల శేఖర్, వరికుప్పల శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:**
అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షులు డాక్టర్ వేముల లోకేష్ ఆదేశాలతో సికింద్రాబాద్ తుకారాం గేట్ సుభాష్ చంద్రబోస్ స్టాటు దగ్గర గోగుల స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు మజ్జిగలు పంపిణీ చేశారు. మేడే సందర్భంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కష్టాన్ని నమ్ముకున్నవాడే అసలైన విజేత అని లోకానికి వెలుగునిచ్చే కార్మిక శక్తికి వందనం అన్నారు. ఈసందర్భంగా కార్మికులకు అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెపారు. ఈకార్యక్రమంలో జాతీయ సెక్రెటరీ మక్కల శేఖర్, జాతీయ ఆర్గనైజర్ సెక్రెటరీ, వరికుప్పల శ్రీనివాస్ శ్రీకాంత్, శివలింగం వీరేశం పాల్గొన్నారు.

# నగరంలో ఘనంగా మేడే వేడుకలు

అడ్డగుట్టలో మేడే జెండాను ఎగరవేస్తున్న సిపిఎం నేతలు ఆర్.మల్లేశ్, అజయ్ బాబు తదితరులు

కంటోన్మెంట్‌లో మేడేను పురస్కరించుకొని ఆర్టీసీ ఉద్యోగులను సత్కరిస్తున్న డిఎం సుధాకర్ రావ్

మడ్‌పోర్ట్‌లో మిలటరీ ఎంప్లాయిస్ సర్వీస్ నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

మే డే సందర్భంగా శివాజీ నగర్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలను అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ గౌడ్

కృష్ణకాంత్ పార్క్ వద్ద కార్మిక దినోత్సవ సందర్భంగా జీహెచ్‌ఎంసీ వాటర్‌వర్క్స్ కార్మికులకు మజ్జిగ, టోపీలను అందజేస్తున్న మాజీ శాసనసభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ దేదివ్య విజయ్‌కుమార్.

జలమండలి అలియాబాద్ రిజర్వాయర్ ఆవరణలో ఉద్యోగులు మే డేను సందర్భంగా ఎఐటియుసి జెండాను ఎగురవేస్తున్న ఉద్యోగులు మహ్మద్ సలీమ్, జి.సర్వేశ్వర్, ఎం.బాబు, ఎన్.రాంచందర్, సి.పర్వతాలు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మేడే వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే సందర్భంగా ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ

బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో శుక్రవారం మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న జలమండలి ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాదమోని వెంకటస్వామి గౌడ్

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఆంధ్ర పాలిమర్స్ నందు నిర్వహించిన కార్మిక దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై బిఆర్ఎస్ కార్మిక విభాగం జెండాను ఎగురవేశారు.

అంతర్జాతీయ మేడే సందర్భంగా కార్మిక నాయకుడు చింతల నాగరాజు జీడిమెట్ల పారిశ్రామిక వాడలో నాగరాజు యూనియన్ అధ్యక్షులుగా ప్రాథమికవహిస్తున్న అన్ని కంపెనీల జెండాను ఎగరవేయడం జరిగింది.

బాచుపల్లి మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న నాయకులు

బాగ్‌లింగంపల్లి వివిఎస్‌టి యూనియన్ కార్యాలయంలో మే డే సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తున్న యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపి, ఐఎన్‌టియుసి జాతీయ సంజీవరెడ్డి

మే డే సందర్భంగా మూసాపేట్ సిఆర్ నగర్ లో మాజీ సింగల్ విండోచైర్మెన్ సిపిఐ సీనియర్ నాయకులు గూడెపు కొండల్ రావు పాల్గొని జెండా ఎగురు వేసారు..

## 745 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:**
నారాయణ సేవా సంస్థాన్ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మే 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్లో భారీ ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ శిబిరంలో ముందుగా ఎంపికైన 745 మంది దివ్యాంగులకు మొత్తం 815 నారాయణ మాడ్యులర్ కృత్రిమ అవయవాలు, కాలిపర్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు అవయవాల అమరికతో పాటు, వాటి వినియోగంపై శిక్షణ కూడా ఇస్తారని తెలిపారు. దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని అవసరమైన ప్రతి ఒక్కరికీ కృత్రిమ అవయవాలు అందించి, వారు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం మా ముఖ్య లక్ష్యం" అని తెలిపారు. సంస్థ పేట్రన్ అల్కా చౌదరి మాట్లాడుతూ "ఇలాంటి శిబిరాలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రశాంత్ అగర్వాల్, అల్కాచౌదరి, మహేంద్రసింగ్ రావత్ తదితరులు

దివ్యాంగుల జీవితాల్లో కొత్త ఆశను నింపుతాయి. వారికి స్వతంత్రంగా జీవించే అవకాశాన్ని కల్పించడం మా ధ్యేయం" అని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆశ్రమం హెడ్ మహేంద్ర సింగ్ రావత్ మాట్లాడుతూ, హైదరాబాద్లో ఈ శిబిరాన్ని నిర్వహించడం గర్వంగా ఉంది. లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాము" అని తెలిపారు. శిబిర ఇన్చార్జ్ హరి ప్రసాద్ లడ్డా మాట్లాడుతూ, లబ్ధిదారుల ఎంపిక నుండి అవయవాల అమరిక వరకు ప్రతిదీ నిపుణుల పర్యవేక్షణలో జరుగుతుంది. వారికి సరైన శిక్షణ కూడా అందిస్తాము" అని చెప్పారు

## ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకంపై ప్రభుత్వం కుట్రలు

**-3న జివో నెంబరు 7 ప్రతులు దగ్ధం**

**-జూన్‌లో విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధం**

**సైఫాబాద్, మే 1 ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకంపై రాష్ట్ర ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకిస్తూ ఈ నెల 3వ తేదీన జివో నెంబరు 7 ప్రతులను దహనం చేసి ఎక్కడికక్కడ నిరసనలు, ధర్నాలు చేయాలి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోతే జూన్ మొదటి వారంలో లక్ష మంది విద్యార్థులతో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధనం చేస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఎన్నో పోరాటాలు చేసి ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని సాధిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే ఈ పథకాన్ని రద్దు చేయాలని ఆయన సవాల్ విసిరారు. విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకోవాలన్న హైకోర్టు తీర్పుకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్నారు. ఉన్నత విద్యను పేద విద్యా

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ర్థులు అభ్యసించకుండా ప్రభుత్వం దూరం చేస్తున్నదని, విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజులు చెల్లిస్తామన్న ప్రభుత్వ నిర్ణయం అవివేకమని ఆయన విమర్శించారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం డొంక తిరుగుడు మాటలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ పథకంపై తాము కూడా కోర్టుకు వెళతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి బిసిలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని జాజులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు విక్రమ్‌గౌడ్, మహేష్, బత్తిని రాజు, మల్లేష్ తదితరులు పాల్గొనగా, ఎరుకల యతీశ్వర్‌గౌడ్‌ను సంఘం జెఏసి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆయన నియమించారు.

### వీధికుక్కల రక్తమార్పిడి ఘటనలపై సమగ్ర విచారణ చేయాలి

**ఆరుద్రఫర్ యానిమల్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డిమాండ్**

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో వీధికుక్కలపై రక్తమార్పిడి పేరుతో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆరుద్రఫర్ యానిమల్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసంస్థ ప్రతినిధి హన్మంతరావు మాట్లాడుతూ వీధికుక్కల రక్తాన్ని సేకరించి సాచెట్‌లలో నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని, ఈ వ్యవహారంపై ఇప్పటికే స్థానికుల సమాచారం ఆధారంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జంతు హింసకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న తమ సంస్థకు వచ్చిన వివరాల ప్రకారం, కొన్ని వెటర్నరీ క్లినిక్‌లు మరియు అనుమానాస్పద బ్లడ్ బ్యాంకులు నిబంధనలు పాటించకుండా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కొన్ని వెటర్నరీ ఆసుపత్రుల్లో కుక్కల నుంచి అధిక మోతాదులో రక్తం సేకరించడం, భారీ దోసుల మందులు ఇవ్వడం, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతోందని ఆరోపించారు. ఈచర్యలు జంతువుల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్వినియోగాలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు తక్షణమే జోక్యం చేసుకుని, వెటర్నరీ క్లినిక్‌లు, బ్లడ్ బ్యాంకులపై కఠిన తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇకముందు జంతువులకు ఇటువంటి దయనీయ పరిస్థితులు ఎదురుకాకుండా ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బాలకృష్ణ, హరిణి, శివ, ధార తదితరులు పాల్గొన్నారు.

### ప్రెస్ క్లబ్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:**
ఎండాకాలంలో చిన్నారులకు ఆహ్లాదం, ఆనందం అందిస్తూ వారిలో ఉత్సాహం నింపేందుకు ప్రెస్ క్లబ్ హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్) నడుం బిగించాయి. ప్రెస్ క్లబ్, శాట్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు జరగనున్నాయి. ఈనెల 6 నుంచి జూన్ 6 వరకు సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చెస్, క్యారమ్, యోగా, జుంబా, పెయింటింగ్ విభాగాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టుల పిల్లలతో సహా చుట్టుపక్కల చిన్నారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఆసక్తి ఉన్నవాళ్లు ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 8374452215 ఫోన్ నంబరులో సంప్రదించాలి.

## భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య

**కొంపల్లి, మే 1, ప్రభాతవార్త**
భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రాఘవేంద్ర కాలనీ బీరంగూడలో నివసించే మల్లికార్జున్ (34) వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇతని సొంతం బీదర్ జిల్లా కర్ణాటక రాష్ట్రం. బ్రతుకుతెరువు కొరకు బీరంగూడకి వచ్చి ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2012 సంవత్సరంలో తెలిసిన వారి ద్వారా అశ్విని అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఒక సంవత్సరం పాటు వారి కాపురం సజావుగానే జరిగినప్పటికీ అనంతరం క్రమేపి దంపతులు ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరుగుతూ వచ్చాయి. వీరికి ఇద్దరు పిల్లలు. మల్లికార్జున్ తల్లి పేరున ఉన్న 4 ఎకరాల వ్యవసాయ భూమిని విక్రయించి డబ్బు తీసుకురమ్మంటూ అశ్విని పలుమార్లు భర్త మల్లికార్జున్‌తో గొడవ పడుతూ వచ్చేది. ఈ కారణంగా కుటుంబంలో చాలా కాలం నుండి గొడవలు జరుగుతున్నాయి. అలాగే అశ్విని ఓ ప్రైవేట్ పరిశ్రమలో డ్యూటీకి వెళ్ళేది. డ్యూటీ అయిపోయిన తర్వాత కూడా ఇంటికి సమయానికి తిరిగి రాకుండా బయట గడిపేది. దీంతో మల్లికార్జున్ పలుమార్లు అశ్విని ఈ విషయమై మందలించాడు. అయితే బయట తిరగడం తన ఇష్టం అంటూ అశ్విని భర్త మల్లికార్జున్‌ను దబాయించేది. ఇదిలా ఉండగా కొంతకాలం క్రితం మల్లికార్జున్ కొంత నగదు సర్దుబాటు చేసుకుని జీవనోపాధి కొరకు కొత్త ఆటో ట్రాలీని కొనుగోలు చేశాడు. కొంత నగదు ఇచ్చి ఫైనాన్సర్ ద్వారా ట్రాలీ కొనుగోలు చేశాడు. ఇది నచ్చని అశ్విని పలుమార్లు భర్తతో గొడవ పడేది ఊర్లో పొలం అమ్మి డబ్బు తీసుకు రమ్మన్న తీసుకురావడం లేదు ట్రాలీ అమ్మి డబ్బు ఇవ్వమన్నా ఇవ్వడం లేదంటూ భర్తతో తరచూ గొడవకు దిగేది. అశ్వినికి మద్దతుగా అశ్విని మేనత్త సిద్ధమ్మ, అశ్విని సోదరుడు శివ, మేనమామ సంగయ్య, అశ్విని సోదరి ప్రియ వీరు ఒక జట్టుగా ఏర్పడి తరచూ మల్లికార్జునుని మానసికంగా వేధించేవారు. గత నెల 30న ఇదే విషయమై అశ్విని బంధువులు సిద్ధమ్మ, బామ్మర్ది శివ, మరదలు ప్రియ, అశ్విని మేనమామ సంగయ్యలు మల్లికార్జున్‌తో తీవ్రమైన వాగ్వివాదానికి దిగి మల్లికార్జున్‌పై దాడి చేసి కొట్టారు. తనకు జరిగిన అవమానంపై మృతుడు మల్లికార్జున్ సెల్ఫీవీడియోలో తన బాధను వివరిస్తూ తన సోదరుడికి రికార్డును పంపించాడు. తరచూ తన భార్య తరపు బంధువులు తనను వేధిస్తూ ఉండడంతో మల్లికార్జున్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. దీంతో మల్లికార్జున్ శుక్రవారం ఉదయం బాచుపల్లిలోని మమత ఆసుపత్రి సమీపంలో తన ట్రాలీకి ఉన్న హుక్కికి నైలాన్ తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన భార్య వారి బంధువులు తనను డబ్బు కోసం తరచూ వేధిస్తున్నారని మల్లికార్జున్ తన సోదరుడైన నీలకంతకు చెప్పుకొని బాధపడేవాడు. స్థానికుల సమాచారం మేరకు బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం మల్లికార్జున మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కార్మికుల శ్రమే అభివృద్ధికి మూలం : డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి



మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవి శేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 1 ప్రభాతవార్త**
కార్మికుల శ్రమే అభివృద్ధికి మూలమని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవి శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్యాణ్‌నగర్ వెంచర్ శ్రీ ప్రధాన ద్వారం వద్ద సీఐటీయూ ఆధ్వర్యములో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎర్రజెండా ఆవిష్కరించి అమరులకు జోహార్లు అర్పించారు. అనంతరం కార్మిక నాయకులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ రవి శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మిక హక్కుల కోసం పోరాడుదాం అంటూ కార్మికులతో కలసి పిడికిలి ఎత్తి నినాదాలు చేశారు. కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమములో నీలిమ హాస్పిటల్ ఎం.డి శ్రీనివాస రావు , సీఐటీయూ సిటీ ప్రెసిడెంట్ బి.సోమేష్, ట్రెజరర్ నరేందర్, బాలు,శేఖర్, మహబూబ్, శ్రీనివాస్ ,నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

### డాక్టర్.అలంకర్ సింగ్‌కు సన్మానం



**చార్మినార్,మే 1 ప్రభాతవార్త :**
పంజాబీ యూనివర్సిటిలోని డిపార్టుమెంట్ ఆఫ్ మ్యూజిక్,గుర్మత్ సంగీత్ చైర్‌కు చెందిన డాక్టర్,అలంకర్ సింగ్ హైదరాబాద్ నగరానికి విచ్చేసిన సందర్భంగా శుక్రవారం సీనియర్ బిజెపినాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ శుక్రవారం ప్రొఫెసర్ అలకంర్ సింగ్‌ను శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎస్.సజ్జన్ సింగ్,జోగేందర్ సింగ్,రమేష్ సూరపనేని,డాక్టర్.జి.జయరామ్ పాల్గొన్నారు.

### భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త రిమాండ్

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** భార్యను గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేసిన సంఘటనలో నిందితుడైన భర్తను మీర్‌పేట్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. బిఎన్‌రెడ్డినగర్ సమీపంలోని టీచర్స్ కాలనీలో నివసిస్తున్న నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం శివన్నగూడెంకు చెందిన నల్లబోతు నర్సింహ (60) తన భార్య వసంత (52) వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో గత బుధవారం గొడ్డలితో ఆమెను నరికి చంపిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కేసును దర్యాప్తు చేస్తున్న మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

### కుత్బుల్లాపూర్‌లో కార్మికుడి అనుమానాస్పద మృతి..

**నలుగురిపై కేసు నమోదు**

**పేట్ బషీరాబాద్, మే 1, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ పరిధిలోని గోదావరి హోమ్స్ సమీపంలో ఉన్న నిర్మాణ స్థలంలో పనిచేస్తున్న కార్మికుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సునీల్ రామ్ (35) కూలీగా పనిచేస్తూ నివసిస్తున్నాడు. ఏప్రిల్ 30 రాత్రి సుమారు 10 గంటల సమయంలో సునీల్ రామ్ తన భార్యతో వ్యక్తిగత విషయాలపై వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో అక్కడ న్యూసెన్స్ సృష్టిస్తున్నాడని సమాచారం రావడంతో సైట్ ఇంజనీర్ ప్రసాద్‌తో పాటు మరికొందరు కూలీలు అతనిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. అనంతరం అతన్ని నిర్మాణ స్థలానికి తీసుకెళ్లి కొబ్బరి తాడుతో సిమెంట్ స్తంభానికి కట్టేసి అక్కడే వదిలివేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సునీల్ రామ్ ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. మే 1 ఉదయం సుమారు 9 గంటల సమయంలో అతని భార్య గమనించి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

## ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించిన ఘనత సిఎం రేవంత్ రెడ్డిదే : ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి సిఎంకు పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

**కంటోన్మెంట్,మే 1 ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల శ్రమ,సేవలను గుర్తించి వారి హక్కుల పరిరక్షణ కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మేడే, కార్మిక దినోత్సవం,శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఆర్టీసీ ఉద్యోలు చేపట్టిన సిఎం రేవంత్‌రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు పాలాభిషేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మరోసారి రుజు చేశాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెను అవహేళన చేశారన్నారు. ఆ సమయంలో వారు ఆత్మహత్యకు పాల్పడితే కనీసం పరామర్శించలేదన్నారు. ప్రజా ప్రభుత్వం, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను ఆమోదించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్.ఎం. సరస్వతీ, పికెట్ డిపోమేనేజర్ రవిందర్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు గుజ నాగేందర్ యాదవ్,ఎస్.వెంకటేష్, ఆర్.డి.నాగేశ్ యాదవ్,సదానంద్ గౌడ్, రంగ రవిందర్‌గుప్త, మారుతీ గౌడ్, ఉత్తరయ్య,బల్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధను సంఘటితంగా ఉద్యమించాలి : తలసాని

ఓల్డ్ జేలు ఖానా వద్ద మేడే జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**అడ్డగుట్ట,మే 1 ప్రభాతవార్త:** కార్మికుల పోరాటాలు,త్యాగాలకు ప్రతీక మేడే అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మేడేను పురస్కరించుకొని శుక్రవారం మోండా డివిజన్‌లోని ఓల్డ్ జేలు ఖానా వద్ద జిహెచ్ఎంసి కార్మికుల అధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో కార్మికులు తమ హక్కులు సాధించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటింగా ఉద్యమించాలన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిక్రిష్ణ, వెంకటేష్,నర్సింగ్,శేఖర్,బిఆర్ఎస్ నేతలు తలసాని స్కైలాబ్ యాదవ్,అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొండాపురం మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గంధం రాములుకు శ్రమశక్తి అవార్డు అందజేత...

మంత్రి వెంకటస్వామి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న గంధం రాములు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 1, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల ఉద్యోగుల కార్మికుల సంక్షేమం కోసం, నిరుద్యోగులకు ఉచిత జాబ్ మేళాలు పెట్టి అందరికి సేవ చేస్తున్న తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములుకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డును అందజేసి సత్కరించింది.ఈ అవార్డు రవీంద్రభారతిలో జరిగిన మే డే ఉత్సవాల సందర్భంగా రాములుకి శ్రమశక్తి అవార్డునుశుక్రవారం రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రివర్యులు డాక్టర్ గడ్డం వి వెంకటస్వామి చేతులమీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, కనీస వేతనాల మండలి బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఐఎఎస్ దాసరి హరిచందన,కమిషనర్ ప్రమీల ప్రైవేటు ఉద్యోగుల సంఘం నాయకులు గ్యార శ్రీనివాస్,కలకోటి సత్యనారాయణ,చంద్రశేఖర్, రవికుమార్ అధికారులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సొసైటీ ప్రతినిధులు, మహాదేవ్ సేవా ట్రస్ట్ సభ్యులు

**పేట్ బషీరాబాద్, మే 1, ప్రభాతవార్త**

మేడే సందర్భంగా కొంపల్లిలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. మహాదేవ్ సేవా ట్రస్ట్ జయభేరి కొంపల్లి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ రక్తదాన శిబిరానికి రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు హాజరై తమ మద్దతు తెలిపారు. కాలనీవాసులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయడంతో కార్యక్రమం విజయవంతమైంది.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ రక్తదానం జీవదానం అని పేర్కొంటూ, ఆపత్కాలంలో చికిత్స పొందుతున్న వారికి, ప్రమాదాలకు గురైన వారికి రక్తం ఎంతో అవసరమని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, మహాదేవ్ సేవా ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, మహాదేవ్ సేవా ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నేడు ఈ ఏరియాల్లో నీళ్ల సరఫరా బంద్.

**కార్వాన్,మే1 (ప్రభాతవార్త)** మెహిదీపట్నం ప్రాంతంలో గల ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్స్ లో ఉన్న పాత బ్యాలెన్సింగ్ ట్యాంక్ శుభ్రం చెసె పనుల కారణంగా మే 2వ తేదీన పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వాటర్ బోర్డు అధికారులు తెలిపారు.శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు పనులు కొనసాగుతాయన్నారు..దీంతో 24 గంటల పాటు ఈ ప్రాంతాలైన రెడ్ హిల్స్,నాంపల్లి, మల్లేపల్లి,సీతారాంబాగ్,గోడేకే ఖబర్, హిందీ నగర్,అసెంబ్లీ, సెక్రెటేరియట్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్,ఆదర్శనగర్,సౌత్ సెంట్రల్ రైల్వే,నాంపల్లి,గన్ ఫౌండ్రి,చింతల్ బస్తీ,విజయనగర్ కాలనీ,ఓల్డ్ మల్లేపల్లి,ఆసిఫ్ నగర్,అహ్మద్ నగర్,కవాడిగూడ వార్డ్,గాంధీనగర్ వార్డ్,దోమలగూడ, బంజారాహిల్స్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదని అన్నారు.

## రామాలయంలో పాంచాహ్నిక అష్టకుండాత్మక రామాయణ మహాయజ్ఞ మహోత్సవాలు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 1, ప్రభాతవార్త**

కూకట్‌పల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీ హనుమా, గరుడ మూర్తుల విగ్రహ స్థాపన ప్రయోక్తంగా నిర్వహిస్తున్న పాంచాహ్నిక అష్టకుండాత్మక శ్రీ రామాయణ మహా యజ్ఞ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ మహాయజ్ఞ మహోత్సవాల్లో కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఆహ్వానం మేరకు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీని కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు వద్దేపల్లి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఈటెల రాజేందర్ శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్య దర్శనం చేసి, ప్రతిష్టాపనకు సిద్ధంగా ఉన్న గరుడ, హనుమాన్ విగ్రహలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ శ్రీ రామాయణ మహా యజ్ఞాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర

కూకట్‌పల్లి రామాలయంలో జరిగిన పూజలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్

పోషిస్తాయని, భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలకు అందించే గొప్ప వేదికలని అన్నారు. ఇటువంటి మహోత్సవాలు హిందూ సంస్కృతి పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రముఖులు, రామభక్తులు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఎంపి వేం నరేందర్ రెడ్డి

**చిక్కడపల్లి మే 1 ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలోని ప్రొటెస్టంట్ క్రైస్తవ మైనారిటీల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డిని శుక్రవారం రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సల్మాన్ రాజ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సమాజంలో క్రైస్తవ సోదరుల పాత్ర వెలకట్టలేనిది. సామాజికంగా, విద్యాపరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన న్యాయం జరిగేలా చూస్తాను. రాజ్యసభ సభ్యునిగా నాపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మైనారిటీల సంక్షేమానికి తోడ్పడతానని పేర్కొన్నారు. గొనె సల్మాన్ రాజ్ గోనే మాట్లాడుతూ ప్రొటెస్టంట్ క్రైస్తవుల అవసరాలను గుర్తించడంలో టీయూసీపీఏ ఎప్పుడూ ముందుంటుంది. నరేందర్ రెడ్డి ఎంపీగా

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ని కలిసి వినతి పత్రాన్ని అందజేస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సల్మాన్ రాజ్

బాధ్యతలు చేపట్టడం మాకు ఎంతో సంతోషకరం. ఆయన నాయకత్వంలో మైనారిటీలకు రాజకీయంగా, సామాజికంగా తగిన గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాం అని తెలిపారు.అనంతరం మైనారిటీలకు నాయకత్వ పదవుల కల్పనపై వారు చర్చించగా, ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామన్ గౌడ్, బి. ప్రేమ్ సాగర్, పి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పోరాట ఫలితంగానే ఎనిమిది గంటల పని

బోయిన్‌పల్లి చౌరస్తాలో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న జంపన ప్రతాప్

**కంటోన్మెంట్,మే 1 ప్రభాతవార్త:** ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లి చౌరస్తాలో నిర్వహించిన మేడే వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ చికాగోలో 16 గంటల పనితీరుకు నిరసనగా పోరాటం చేసి ఎంతో మంది బలైయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పోరాట ఫలితంగానే 8 గంటలు పని సాధించుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పిడి మధుకర్ మల్యాద్రి, సాయిబాబా యాదవ్, మధు, యాదగిరి, సురేష్, సత్య నారాయణ, పవన్, శ్రీకాంత్, శశి, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే ముఠాగోపాల్


మదర్ లాండ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అలీ బాయ్ నుసన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, మే 1, ప్రభాతవార్త :** సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మదర్ లాండ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అలీ బాయ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని అమ్మవారి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ లో హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అలీ బాయ్‌ని వారు అభినందించారు. ఈ కార్యక్ర మంలో సొసైటీ సభ్యులు నిర్మలమ్మ , రామ్ నగర్ సీను, మల్లేష్, వెంకటేష్, కృష్ణంరాజు, నవాజ్ పాల్గొన్నారు

## కనుల పండుగగా క్రికెట్ టోర్నమెంట్..

### జర్నలిస్టుల క్రీడా స్ఫూర్తి భేష్ : డిసిపి శ్రీనివాస్




**అత్తాపూర్ మే1,ప్రభాతవార్త :** ఆహ్లాదకరమైన వాతావరణంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం కన్నుల పండుగ జరిగింది. శివరాంపల్లిలోని విజయానంద్ స్టేడియం వేదికగా జరిగిన ఈ టోర్నమెంట్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు రసవత్తరంగా సాగాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో గద్దె యాదగిరి టీం ఘనవిజయం సాధించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గద్దె యాదగిరి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. ద్వితీయ బహుమతిని వర్కాల చందు టీమ్ గెలుచుకున్నారు. మైలార్ దేవులపల్లి తాజా మాజీ కార్పొరేటర్ బీజేపీ సీనియర్ నాయకుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ఉదయం జ్యోతి వెలిగించి టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. డీసీపీ ఎస్ శ్రీనివాస్ విజేతలకు బహుమతులను పథకాలను అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ ద్వారా రాజేంద్రనగర్ జర్నలిస్టులు క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్న విధానం అభినందనీయమని ప్రశంసించారు. క్రీడలు మానసికల్లాసాన్ని కలిగించడమే కాకుండా వ్యక్తుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని మరింత పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు, రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్, దేవాదాయ శాఖకు చెందిన శ్రీనివాస్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు మ్యాడమ్ మధుసూదన్ , జర్నలిస్టులు నాయకులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో చండీహోమం

శ్రీఉజ్జయినీ మహాకాళి ఆలయంలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు.

**బేగంపేట మే 1,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి దేవాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు.ఈ హోమంలో పాల్గొనేందుకు జంట నగరాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.ప్రతి నెల పౌర్ణమి రోజున అమ్మ వారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆలయానికి తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసారు.ఉదయం ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని అనంతరం చండీహోమంలో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేసారు.ఈ కార్యక్రమంలో ఈ ఓ మనోహర్ రెడ్డితో పాటు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి : ట్రాఫిక్ ఏసిపి శంకరరాజు

తాజ్ వివాంతాలో హోటల్ సిబ్బందికి ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు.

**బేగంపేట మే 1,ప్రభాతవార్త**

ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని,ప్రమాదాలకు దూరంగా ఉండాలని తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. శుక్రవారం బేగంపేట పరిధిలోని తాజ్ వివాంతా హోటల్‌లో సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు.రోడ్డుపై ప్రయాణించే సమయంలో ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని,కారులో ప్రయాణించే వారు తప్పకుండా సీటు బెల్టు ధరించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,త్రిబుల్ రైడింగ్ చేయవద్దని,సెల్‌ఫోన్ డ్రైవింగ్ తో వాహనంలో ప్రయాణించే వారికి ఎదురుగా ప్రయాణించే వారికి ఇద్దరికీ ప్రమాదమేనని ఏసీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీతో పాటు ట్రాఫిక్ సిబ్బంది ,పాల్గొన్నారు.

## మెహదీపట్నంలో విద్యార్థి జెఎసి భారీ నిరసన


నిరసనలో వేముల రామకృష్ణ విద్యార్థి జేఏసీ..

**కార్వాన్,మే1(ప్రభాతవార్త)** మెహదీపట్నంలో బీసీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి భారీ నిరసన చేపట్టారు.ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 7 ప్రతులను చింపివేసి తమ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భముగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ. .బీసీ,ఎస్సీ,ఎస్టీ,ఇబీసీ,మైనారిటీ విద్యార్థులఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వలన ప్రైవేట్ కళాశాలలు ఈ ద్యూస్ కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు,టిసిలు ఇవ్వకపోవడంతో వారు ఉద్యోగాలు,ఉన్నత విద్యలో చేరలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.తక్షణమే నిధులు విడుదల చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## శునకాల రక్తంతో తాము వ్యాపారం చేయడం లేదు

**సైఫాబాద్, మే 1 ప్రభాతవార్త:** శునకాల రక్తంతో వ్యాపారం చేస్తున్నట్లు మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని పూర్తిగా ఆరోపణలేనని పెట్స్ కేర్ సూపర్ స్పెషాలిటి ఫౌండర్ డాక్టర్ కె.వెంకట్‌యాదవ్ స్పష్టం చేశారు. తమ హాస్పటల్ అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరూ కావాలనే పూర్తిగా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము హాస్పటల్ స్థాపించి 15 ఏళ్ళు గడుస్తున్నదని, ఇప్పటి వరకు లక్షల కుక్కలకు ట్రీట్‌మెంట్, సర్జరీలు చేశామని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఉన్న నిపుణులైన వైద్యులు, టెక్నిషియన్లతో కూడిన బృందంతో పెట్స్ వైద్యం అందిస్తున్నానని తెలిపారు. తమ వద్ద గతంలో పనిచేసిన కొందరూ వ్యక్తులు పక్కా పథకం ప్రకారం తమ హాస్పటల్‌ను అప్రదిష్టపాలు చేసేందుకు తాము వీధి కుక్కల నుంచి రక్తం సేకరించి విక్రయిస్తున్నామని జంతు ఉద్యమకర్త మేనకాగాంధీకి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌యాదవ్

ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో జిహెచ్ఎంసికి, పశుసంవర్ధక శాఖకు చెందిన పలువురు తమ హాస్పటల్‌లో తనిఖీ చేశారని, ఏలాంటి ఆధారాలు లభించలేదని ఆయన స్పష్టం చేశారు. హాస్పటల్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, డిఫమేషన్ సూట్ కూడా ఫైల్ చేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ సలహాదారు విహెచ్‌కు అభినందన వెల్లువ


విహెచ్‌కు మిఠాయి తినిపిస్తున్న అంబర్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జీ డాక్టర్ రోహిన్‌రెడ్డి,

**హైదరాబాద్, మే 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావును అభినందనలతో ముంచెత్తుతున్నారు ఆపార్టీ నాయకులు. శుక్రవారం అంబర్‌పేటలోని విహెచ్ నివాసానికి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టర్ రోహిన్‌రెడ్డి విహెచ్‌ను శాలువతో సత్కరించి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి.హనుమంతరావుకు ప్రభుత్వ సలహాదారు పదవితో పాటు క్యాబినెట్ హోద్దాను కూడా ప్రభుత్వం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న హనుమంతరావు సేవలను ప్రభుత్వ పాలనలో వినియోగించుకోవడం శుభ పరిణామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫిషర్ డిపార్ట్మెంట్ చైర్మన్ మెట్టు సాయి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, అప్సర్ యూసుఫ్ జాహి, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పుల్ల నారాయణ స్వామి, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, విజితారెడ్డి, గడ్డం శ్రీధర్‌గౌడ్, దిలీప్ కుమార్ నేత, ఫరీద్, లక్ష్మణ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## చింతల్‌లో ఉచిత వివాహ పరిచయ వేదిక..

### విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

**జీడిమెట్ల, మే 1, ప్రభాతవార్త**

హైదరాబాద్ నగర శివారు చింతల్‌లో విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు అడ్లూరి రవీంద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీ సాయి కాలనీ వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్ కర్నేకంటి లక్షణాచారి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం రూపంలో జరుగనుంది.ఈనెల 2వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు చింతల్ మెయిన్ రోడ్‌లోని శ్రీ సాయి కాలనీలో, ఆక్సిస్, ఐడిబిఐ బ్యాంకుల సమీపంలో ఉన్న శ్రీ అభయ అంజనేయ పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. మధ్యాహ్నం 1 గంటకు భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ వేదిక ద్వారా విశ్వకర్మ సమాజానికి చెందిన కుటుంబాలు తమ పిల్లలకు అనుకూలమైన వధూవరులను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ పిల్లలతో పాటు బయోడేటాతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు అడ్లూరి రవీంద్ర చారిఫోన్ నంబర్ : 98481 99744, వాట్సాప్ నంబర్ : 9491888266 లలో సంప్రదించాలని తెలియజేశారు.

## కేంద్ర నిరంకుశ కార్మిక కోడ్‌లను అమలుచేయొద్దు : మొగుళ్ళ రాజిరెడ్డి



**నాంపల్లి, మే 1 ప్రభాతవార్త :** గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశంలోని కార్మికుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కొత్తగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ 4 కార్మిక కోడ్లను రాష్ట్రంలో అమలు చేయొద్దని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి విజ్ఞప్తి చేశారు. మే డే సందర్భంగా రవీంద్రభారతిలో మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా, పుష్పగుచ్చం అందించి సత్కరించారు. అసంఘటిత కార్మికులైన భవన నిర్మాణ, రవాణారంగం, గిగ్ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే జలమండలి గుర్తింపు ఉద్యోగ సంఘాల ఎన్నికలను నిర్వహించేందుకు కార్మికశాఖ ఆదేశాలు జారీ చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.చంద్రశేఖర్, రాఘవేంద్రరాజ్, బి.నరసింగరావు, శ్రీనివాస్‌యాదవ్, గౌస్‌పాషా, సైద్ రిజవాన్, బి.మహేష్ పాల్గొన్నారు.

## లాలాపేట్ వద్ద రోడ్డు ప్రమాదం

### రాపిడో డ్రైవర్ మృతి, యువకుడికి తీవ్ర గాయాలు

**తార్నాక, మే 1 ప్రభాతవార్త :** లాలాపేట్ నుండి మౌలాలి వైపు వెళ్తున్న రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జవహర్‌నగర్‌కు చెత్త లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న రాపిడో బైక్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా దండంపల్లి గ్రామానికి చెందిన ఎన్న లక్ష్మారెడ్డి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. అతను రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బైక్ వెనుక కూర్చున్న భువనగిరికి చెందిన పాల్ (19) తీవ్రంగా గాయపడి సమీపంలోని మైహెల్త్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.వీరిద్దరు లాలాపేట్ మంజరి నర్సింగ్ హోం వరకు చేరుకున్నారు. అదే సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన చెత్తలారి వీరి బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెజ్లింగ్ పోటీలలో బాల్ కేసరి బిరుదును సాధించిన రేవన



కుమారి రేవనను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు పులిపాటి రాజేష్ కుమార్,కన్నయ్యలాల్

**చార్మినార్,మే 1 ప్రభాతవార్త :**

ఇటీవల గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర రెండవ పూల్- అంబేద్కర్ రెస్లింగ్ (మల్ల యుద్ధం) 2026 పోటీలలో బహదూర్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కుమారి నేరేరోళ్ల రేవన బాల్ కేసరి బిరుదును సాధించింది.బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్ బాల్ కేసరి బిరుదును సాధించిన రేవనను శాలువ కప్పిసన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన రేవన బాల్ కేసరి బిరుదును సాధించటం గర్వ కారణమని తెలిపారు.రెస్లింగ్ పోటీలలో రేవన భారత దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

### సబ్సిడీ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

**సైఫాబాద్, మే 1 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అందిస్తున్న సబ్సిడి ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని రాష్ట్రీయ ఉద్యోగ భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ సూచించారు. రాష్ట్రీయ మసిహి పరిషత్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఉద్యోగ భారత్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా అద్దంకి స్వామిదాస్ రంజిత్ ఓఫిల్‌ను నియమించి, ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ప్రధాని నరేంద్రమోదీ కన్న కలలు వికసిత్ భారత్‌గా ఎదగాలంటే తయారీ రంగాన్ని సేవలు, ఐటి, పర్యాటక రంగాలతో కలపకుండా ప్రత్యేక విధానం, బడ్జెట్, ప్రాధాన్యంతో అభివృద్ధి చేయాలన్నారు.

## గ్యాస్ ఫిల్లింగ్ చేస్తుండగా రెండు ఆటోలు దగ్ధం

**సైఫాబాద్, మే 1 ప్రభాతవార్త:** నారాయణగూడలోని పెట్రోల్ బంక్‌లో ఆటోకు గ్యాస్ ఫిల్లింగ్ చేస్తుండగా మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు రెండు ఆటోలు దగ్ధమైన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. నారాయణగూడ పోలీసుల కథనం ప్రకారం నారాయణగూడ మెట్రో స్టేషన్ కింద, మార్వేల్ ఫంక్షన్ హాల్ ప్రక్కనే ఉన్న పెట్రోల్‌బంక్‌లో గ్యాస్ ఫిల్లింగ్ చేస్తుండగా ఒక ఆటో దగ్ధం కాగా, మరొక ఆటో పాక్షికంగా కాలిపోయింది. ఈ ఘటనలో బండ్లగూడ నూర్ నగర్‌కు చెందిన ఎండి సిరాజ్, మరోక వ్యక్తి రాజ్‌కుమార్ గాయపడ్డారు.చిన్న సోముల అనే వ్యక్తి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. గాయపడ్డవారిని పోలీసులు చికిత్స నిమిత్తం కింగ్‌కోఠిలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### నారాయణగూడలో అనుమానస్పదంగా రెండు కార్లు దగ్ధం

పలుకేసుల్లో నారాయణగూడ పోలీస్ స్టేషన్ పోలీసులు సీజ్ చేసిన రెండు కార్లు పార్క్ చేసిన చోట శుక్రవారం ఉదయం దగ్ధమైనాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురైనారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సహాయంతో సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
హాయత్‌నగర్ సర్కిల్-14

నిట్ నెం. E/5826/3/2026-27/43 తేది: 01.05.2026

పనిపేరు: (9 పనులు) "GHMC, LB నగర్ జోన్ పరిధిలోని నాగోల్ సర్కిల్-11 మరియు హాయత్‌నగర్ సర్కిల్-14కు చెందిన 14-BN రెడ్డి నగర్, 44-చింతలకుంట, 43-వనస్థలిపురం, 52-పెద్ద అంబర్‌పేట ప్రాంతాల్లోని వివిధ ప్రదేశాలలో ఓపెన్ జిమ్ పరికరాలు మరియు పిల్లల ఆట పరికరాల సరఫరా మరియు అమరిక, సీసీ రోడ్డు నిర్మాణం 'Jet Patcher' యంత్రాన్ని ఉపయోగించి రోడ్డు గుంతల మరమ్మతులు మరియు కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన మిగిలిన పనులు. అంచనా మొత్తం : రూ.233.20 లక్షలు. బిడ్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది మరియు సమయం : 11.05.2026 సా.5.00గం. వేదిక: అధికారి పేరు మరియు చిరునామా సెల్ నెం: శ్రీ ఎల్.నాగేందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హాయత్‌నగర్ సర్కిల్-14, ఎల్.బి.నగర్ జోన్, MMC, (M): 9989930401. తదుపరి వివరాలు http://www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హాయత్‌నగర్ సర్కిల్-14, LBNZ, GHMC.

DIPR.NO. 1761-PP/CL/ADVT/1/2026-27 తేది: 01.05.2026

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR MEDCHAL-MALKAJGIRI DIST AT: MEDCHAL.
ABR.CF NO: 91 OF 2025
Between:
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KHA05T01R-40, ANANDBAGH BRANCH. ...DISPUTANT
AND
Mr. SV NAGA PURNIMA & Others ...OPPONENTS
To,
1. Ms. Naga Purnima S V, W/O. S.Saradhi Prasad, Aged About: 43years, Occ: Bussiness, R/O. H.No29-1427, Plot No 131, Kakatiya Nagar, Ramakrishna Puram Malkajgiri, Hyderabad, Telangana.
2. Saradhiprasad Sanaka, S/O. S.Subba Rao, Aged About 47 Years, Occ: Deputy Manager In Indian Immunologicals Limited Emp Code 2475, R/O. Plot No.131 H.No.29-1427, Kakatiyanagar, Ramakrishnapuram Neredmet Malkajgiri, Hyderabad, Telangana.
3. Dhanunjaya Araja, S/O Narasimha Rao, Aged About 47 Years, Occ: Deputy Manager In Indian Immunologicals Ltd. Emp Code 005395 Department Of Procurement, R/O. Flat No.G-1 Plot No.147, Dhanvi Square, Nizampet, Hyderabad, Telangana.
4. Sai Vinod Kumar Dosapati, S/O.D.Vijaya Rama Krishna, Aged About 52 Years, Occ: Deputy Manager In Indian Immunologicals Ltd. Emp Code 4685 Department Of Fin Costing Hyderabad., R/O. Flat No.202, Saraya Apts Eshwarpur Colony, Sainikpur, Hyderabad, Telangana.
5. Sandeep Chattumala, S/O. Ch. Satyanandam, Aged About 37 Years, Occ: Senior Executive In Indian Immunologicals Ltd Emp Code. 3862 Department Of Ah-Ap Hyderabad, R/O. H.No.7-418/G5, Sri Sainath Homes Kousalya Colony, Bachupally, Hyderabad, Telangana.
6. Ramaiah Chandanala, S/O.Ch. Narahari, Aged About 48 Years, Occ: Accounts Manager In Choice Solutions Ltd Emp Code.3795 Department Of Corp-Finanace Hyderabad, R/O. H.No.5-179/B, First Floor, Borabanda, Hyderabad, Telangana.
Whereas the above named disputant has instituted a suit against you for recovery of money of Rs.3,64,881/- You are hereby summoned to appear in the above arbitration in person or by an advocate duly instructed On 05-05-2026 the at 01.00 P.M filing which the matter will be decided exparte in accordance with law.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
J. SRINIVAS REDDY, Advocate, Hyderabad.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR MEDCHAL-MALKAJGIRI DIST AT: MEDCHAL.
ABR.CF NO: 37 OF 2025
Between:
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KHB02T01T-23, BALANAGAR BRANCH. ...DISPUTANT
AND
Mr. T. SURESH & Others ...OPPONENTS
To,
1. Mr. Suresh T, S/O. Bairagi, Aged About 38years, Occ: Sr Master Techn Emp No 232/5313/106993 Avionics Division Hindustan Aeronautics Ltd Balanagar Hyderabad, R/O. H.No.6-25, Indiranagar Colony, Boduppal, Hyderabad, Telangana.
2. Bairagi Tamada, S/O Domburu T, Aged About 76 Years, Occ: Ps Father, R/O. H.No.6-25, Indiranagar Colony, Boduppal, Rangareddy, Telangana.
3. Kanthi Kumar Ramancha, S/O Kornel R, Aged About 42 Years, Occ: Supervisor Emp No 261/5347/105803 Avionics Division Hindustan Aeronautics Ltd Balanagar Hyderabad, R/O. H.No.2-108/2/86, Sri Sai Enclave, Boduppal, Rangareddy, Telangana.
4. Ashok Kumar Medi, S/O Mallesh M, Aged About 46 Years, Occ: Supervisor Emp No 261/5210/104672 Avionics Division Hindustan Aeronautics Ltd Balanagar Hyderabad, R/O. H.No.6-2-18, Sanjeevaiah Colony Raju Colony, Balanagar Nr Hanuman Temple, Hyderabad, Telangana.
5. Gopi Singam, S/O Mallesh S, Aged About 38 Years, Occ: Typist Emp Code 2163042 Revenue Department Government Of Telangana, R/O. H.No.6-48, Indiranagar Colony, Boduppal, Rangareddy, Telangana.
6. Jyothi Teppla, W/O Naresh T, Aged About 32 Years, Occ: Senior Coding Analyst Emp Code 901738 R1 Rcm Global Private Limited Uppal Hyderabad, R/O. H.No.6-25, Indiranagar Colony, Boduppal, Rangareddy, Telangana.
7. Naresh Thamada, S/O Bairagi T, Aged About 36 Years, Occ: Senior Application Consultant Emp Code Csi-644 Coserve Department Coserve Software Solutions Private Limited Jubilee Hills Hyderabad, R/O H.No.6-25, Indiranagar Colony, Boduppal, Rangareddy, Telangana.
Whereas the above named disputant has instituted a suit against you for recovery of money of Rs.4,91,925/- You are hereby summoned to appear in the above arbitration in person or by an advocate duly instructed On 05-05-2026 the at 01.00 P.M filing which the matter will be decided exparte in accordance with law.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
J. SRINIVAS REDDY, Advocate, Hyderabad.

## కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి : మర్రి రాజశేఖర్ రెడ్డి

**నేరెడ్‌మెట్ మే 1,ప్రభాతవార్త :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శుక్రవారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన మేడే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జెడ్టీసీ సమీపంలో హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ సంస్థ ముందు నిర్వహించిన జెండా ఆవిష్కరణలో పాల్గొని కార్మికులతో కలిసి జెండా ఎగురవేశారు. అనంతరం అల్వాల్ లేబర్ అడ్డా వద్ద నిర్వహించిన మరో కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించడంతో పాటు కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు అవసరమని, కార్మిక సంక్షేమం కోసం కృషి కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, మురుగేష్, అమీనుద్దీన్, భాగ్యనందరావు, ఇబ్రహీం నవాబు, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, మారుతి ప్రసాద్, ఉస్మాన్, స్వామి, సూర్యప్రకాశ్, తోట నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, ఢిల్లీ పరమేష్, రమేష్, లక్ష్మణ్ యాదవ్, శోభన్, భాస్కర్ రెడ్డి, శరణగిరి, సురేష్, వీణ, హెచ్‌బి కాలనీ మాజీ కార్పొరేటర్లు అంజయ్య, ప్రభుదాస్, కార్మిక సంఘాల నాయకులు చక్రవర్తి, దామోదర్, దయాకర్, జాజుల బాలా భూపాల్ యాదవ్, సుదర్శన్ పాల్గొన్నారు.

## మలక్ పేట ఎసిపిగా బాధ్యతలు చేపట్టిన రాజా వెంకటరెడ్డి

మలక్ పేట ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఎల్. రాజా వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి, చిత్రంలో బదిలీ అయిన ఏసీపీ సుబ్బరామిరెడ్డి

**మలక్ పేట, మే 1, ప్రభాతవార్త:** మలక్ పేట్ ఏసీపీగా ఎల్. రాజా వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టారు. కాగా మలక్ పేట్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరామిరెడ్డిని డిజిపి కార్యాలయానికి అటాచ్ చేయడంతో శుక్రవారం ఎసిపి సుబ్బరామిరెడ్డి ఎసిపి రాజా వెంకటరెడ్డికి బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. మలక్ పేట ఎసిపి గా బాధ్యతలు చేపట్టిన రాజా వెంకటరెడ్డిని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి, మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ, డబీర్ పురా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఉపశంకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నూతన ఎసిపి రాజా వెంకటరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యమని పేర్కొన్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు దోస్త్‌లో నమోదు ప్రారంభం

### - 7లోపు నమోదు పూర్తి చేయాలని సూచన

**నేరెడ్ మెట్ , మే 1,ప్రభాతవార్త :** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉన్న డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా మొదటి దశ ప్రవేశాల కోసం నమోదులు ప్రారంభమైనట్లు కళాశాల అధికారులు తెలిపారు. విద్యార్థులు మే 7లోపు అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాల ఎంపిక సమయంలో 2090 కోడ్ కలిగిన మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సులతో పాటు ఆధునిక అవసరాలకు అనుగుణంగా పలు ఆన్లైన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నట్లు దోస్త్ సమన్వయకర్త డా. అదవి రాజు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బండి రాజు మాట్లాడుతూ, ప్రవేశాల ప్రక్రియలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వేసవి సెలవుల్లో కూడా అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9966911448, 9440867068, 9848574157, 9849575428, 8074797024 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. విద్యార్థులు చివరి తేదీకి ముందే నమోదు పూర్తి చేసి తమకు నచ్చిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

## హమాలిబస్తీలో మహనీయుల విగ్రహావిష్కరణ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌లకు నివాళులర్పిస్తున్న లింగాల హరిగౌడ్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌లకు నివాళులర్పిస్తున్న కొత్తకాపు రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 1 ప్రభాతవార్త:** ఆస్మాన్‌ఘడ్ డివిజన్ హమాలి బస్తీలో మహనీయుల విగ్రహాల ఏర్పాటులో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. హమాలిబస్తీలో ఆస్మాన్‌ఘడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేసి శుక్రవారం ఆవిష్కరించారు. అయితే విగ్రహాల ఏర్పాటుకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు బిజెపి నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌లు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆస్మాన్‌ఘడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవులపల్లి శ్రీనివాస్, రాజు, ప్రభాకర్, దేవేందర్, కృష్ణమూర్తితో పాటు లక్ష్మణ్ ఠాకూర్, నందు, నర్సింహా, ప్రభాకర్, నవీన్ పటాలే, నిర్వాహణ కమిటి సభ్యులు, బస్తీ వాసులు, వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటును సాధించిన బడంగ్‌పేట్ విద్యార్థిని గుడ్ల కీర్తన మర్యాదపూర్వకంగా తెలంగాణ గురుకుల మాజీ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిలను కలిసి సన్మానించిన దృశ్యం: చిత్రంలో విద్యార్థిని తండ్రి గుడ్ల శ్రీనివాస్ ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలో జరిగిన మేడే వేడుకల్లో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్ ,తదితరులు

నీలం సంజీవరెడ్డి నగర్ కాలనీలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మే డే జెండాను ఆవిష్కరిస్తున్న కుంచం వెంకట్ కృష్ణ,తదితరులు

మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన మేడే వేడుకలలో పాల్గొన్న వీరేష్ బాబు, రాధా, బాబురావు తదితరులు

కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహం పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న ముప్పిడి ధన్వంత్, చిట్టుపాక ప్రభాకర్, ముప్పిడి బల్వంత్ తదితరులు

మేడే సందర్భంగా పీవీ ఎన్ కాలనీ మాజీ కార్పొరేటర్ ఆఫీస్ కార్యాలయం దగ్గర జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులను శాలువాతో సన్మానించి పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ తదితరులు

సందర్భంగా కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ బాలాపూర్ ఎఆర్‌సిఐ వద్ద కార్మికుల జెండాను ఎగురవేస్తున్న టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి

కార్మిక దినోత్సవం సందర్భంగా మేడే జెండాను ఎగురవేస్తున్న సిపిఎం నేత, సిఐటియు నాయకుడు దాసరి బాబు

తార్నాకలో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న జింకల మల్లేష్ తధితరులు

# ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

## బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యను సస్పెండ్ చేయాలి: శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** జన గణన నేపథ్యంలో వివాదాస్పదంగా వ్యవహరించిన బడంగ్‌పేట్ సర్కిల్-16 డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్యను సస్పెండ్ చేయాలని తెలంగాణ బిజెపి కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి జిహెచ్ఎంసి కమీషనర్‌ను డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జన గణన కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న తరుణంలో బడంగ్‌పేట్ సర్కిల్‌లో స్థానిక డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య బడంగ్‌పేట్, మీర్‌పేట్ మాజీ మేయర్ల వద్దకు వెళ్ళి వారి చేతుల మీదుగా జన గణన యాప్‌ను ప్రారంభించడంపై శంకర్‌రెడ్డి అభ్యంతర వ్యక్తం చేశారు. డిసి చర్యను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అవినీతి అక్రమాల ఫిర్యాదుల నేపథ్యంలో బడంగ్‌పేట్‌లో

అసహనం వ్యక్తం చేస్తున్న శంకర్‌రెడ్డి

విజిలెన్స్, ఎసిబి అధికారుల బృందం విచారణ జరిపి 122 కోట్ల మేర కుంభకోణం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించిన పిమ్మట జిహెచ్ఎంసి కమీషనర్ ఏకంగా పది మంది అధికారులను సస్పెండ్ చేసి ఇంకా విచారణ కొనసాగిస్తున్న సమయంలో ప్రస్తుత డిసి సమ్మయ్య ఈ విధంగా వ్యవహరించడం గర్హనీయమన్నారు. కమీషనర్ ఈ విధంగా చేయడం పట్ల ఆయన అవినీతి అక్రమాలకు మద్దతు నిస్తున్నారా?... అధికార పార్టీ అడుగులకు మడుగులు వత్తుతున్నారా? తేలాలని అన్నారు. అవినీతిపై పోరాడుతున్న ప్రతిపక్షాలను కించపరిచేలాగా కమీషనర్ వ్యవహరిస్తే సహించమని శంకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు వెంటనే జిహెచ్ఎంసి కమీషనర్ జోక్యం చేసుకొని బడంగ్‌పేట్ డిసి సమ్మయ్యను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన అధికారులు కూడా సక్రమంగా వ్యవహరించకపోతే నిరసనలు వ్యక్తం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని శంకర్‌రెడ్డి హెచ్చరించారు.

## కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం అవసరం : ప్రొ.కోదండరామ్

**తార్నాక, మే 1 ప్రభాతవార్త :** తార్నాకాలో కార్మిక నాయకుడు మోతే శోభన్ రెడ్డి ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మోతే శ్రీలత శోభన్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ పాల్గొని ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ కార్మికుల శ్రమ దేశ నిర్మాణానికి పునాది అని, పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాల పెంపు, సామాజిక భద్రతా పథకాల బలోపేతం అత్యవసరమని అన్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ కార్మికులు నగర పరిశుభ్రత కోసం చేస్తున్న సేవలను కొనియాడుతూ, వారికి ఆరోగ్య భద్రత, భీమా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కార్మికుల పిల్లల విద్య, గృహ వసతి, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు అవసరమని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది, స్థానిక కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మిక ఐక్యతను ప్రతిబింబించేలా నినాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది శానిటేషన్ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, అబ్దుల్ రషీద్, కుదుస్, కృష్ణ, నరేష్, డేవిడ్, మేరీ మాదిగ, కృష్ణ గౌడ్, అర్జున్, రమేష్, భీమ్, సోమేష్, దుర్గాప్రసాద్, మొయిద్దీన్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం చిత్రంలో మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, మోతె శోభన్ రెడ్డి

## భక్తిశ్రద్ధలతో లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త:** శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలు భక్తులకు మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీలోని శ్రీ(కోసగుండ్ల) ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి, కళ్యాణ మహోత్సవంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ దేవస్థానం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఫణిగిరి కాలనీ కోసగుండ్ల నర్సింహాస్వామి దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీహరి, రత్నాకర్‌రెడ్డి, ప్రభు, రామారావు, గణేష్, నాగరాజు, మహేష్, రాకేష్, జలంధర్, నరేశ్, శ్రీధర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా మే డే వేడుకలు

**ఉప్పల్, మే 1 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్కానగర్, ఉప్పల్, రామంతపూర్, హబ్సిగూడ తదితర ప్రాంతాలలో సిఐటియు సిపిఎం జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ సిఐటియు ఆఫీస్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్ ప్రధాన రహదారి నుండి చౌరస్తా, బీరప్పగడ్డ ఆఫీసు వరకు బైక్ ర్యాలీ జరిగింది అనంతరం ఉప్పల్ ఆఫీస్ దగ్గర సీఐటీయూ జెండాను సిఐటియు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె వెంకన్న ఆవిష్కరించారు. అనం తరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మేడే స్ఫూర్తి తో పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహి స్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభు త్వాలకు హెచ్చరికగా గుణపాఠం చెప్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎండి గౌస్, వై.వెంకటేశ్వర్లు, స్వామి శేషు, భీష్మ చారి, కుమార్, సిఐటియు నాయకులు రాజు, జంగయ్య, వెంకటేష్, ఉపేందర్, జిలాని, నరసింహ, సిద్ధులు, కృష్ణ, ఆంజనేయులు,శేఖర్, శివ, శీను, మధు పాల్గొన్నారు.

మే డే సందర్భంగా ఉప్పల్‌లో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నేత జె.వెంకన్న తదితరులు

## ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు : ఎం.డి.రఫీక్

చిన్న చెరువు వద్ద విరిగిపోయిన ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

**రామంతాపూర్, మే 1 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలు శిథిలావస్థకు చేరాయని, వీటికి తక్షణమే మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామంతపూర్ చిన్న చెరువు వద్ద ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలు పూర్తిగా విరిగిపోయి, ప్రజలకు ఉపయోగించలేని స్థితికి చేరుకున్నాయని మార్నింగ్ వాకర్స్ తన దృష్టికి తీసుకుని వచ్చినట్లు తెలిపారు దీంతో స్పందించి శుక్రవారం ఓపెన్ జిమ్ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. పూర్తిగా దెబ్బతిన్న పరికరాలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే మరమ్మతులు చేపటేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మళ్లీ అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పి.ఆదినారాయణ గౌడ్, గంగపుత్ర భాస్కర్,దక్షిణామూర్తి, సత్యనారాయణ, శివారెడ్డి, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, అజయ్, శ్రీనివాస్ గౌడ్, చోటు బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి : ఉప్పల

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త:** వైశ్యులు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంపు కార్యాలయంలో ఐవిఎఫ్ మహిళా విభాగంకి చెందిన పలు నూతన కమిటీల నియామక పత్రాలను ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సామాజికంగా మాత్రమే కాకుండా రాజకీయ రంగంలో కూడా మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్యవైశ్యులను ఏకం చేయడమే ఐవిఎఫ్ ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన నూతన కమిటీ సభ్యులను ప్రకటించి, వారికి బాధ్యతలు అప్పగించారు. చైతన్యపురి కమిటీ అధ్యక్షురాలు బి.అన్నపూర్ణ, కార్యదర్శి బి.కరుణ, కోశాధికారిగా కె.ఇందిర, అల్కాపురి కమిటీ అధ్యక్షురాలు ఎం.జయలక్ష్మి, ఇబ్రాహింపట్నం అధ్యక్షుడు శ్రీరామ్‌సుజాత, కార్యదర్శి వి.నవ్యశ్రీ, కోశాధికారిగా కల్పన, ఖైరతాబాద్ కమిటీ అధ్యక్షురాలు శ్రీదేవి, గుండ్లపోచంపల్లి కమిటీ అధ్యక్షురాలు బి.రజిని, కార్యదర్శి మంజుల, కోశాధికారిగా పద్మిని, రాష్ట్ర సాంస్కృతిక యూనిట్ చైర్మన్‌గా డాక్టర్ బండారు సుజాతశేఖర్,నాగోల్ జిఎస్ఐ అధ్యక్షురాలిగా గజవెల్లి శైలజను నియమించారు. నూతనంగా నియమితులైన సభ్యులకు ఉప్పల శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేసి అభినందించి, సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి పబ్బ చంద్రశేఖర్‌గుప్త, కటకం శ్రీనివాస్, మహిళ అధ్యక్షురాలు మంజుల, ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, చందా భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియామకపు పత్రాలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

## ఎర్లీ బర్డ్ సత్ఫలితాలు సాధించింది : డిసి సమ్మయ్య

వివరాలు వెల్లడిస్తున్న డిసి సమ్మయ్య

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్-16లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఎర్లీ బర్డ్ ఆస్తిపన్ను చెల్లింపు పథకం సత్ఫలితాలు సాధించి విజయవంతం అయ్యిందని డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య వెల్లడించారు. ఈ సారి ఎర్లీ బర్డ్ ట్యాక్స్ వసూళ్ళలలో 11 శాతం వృద్ధి సాధించిందని ఆయన తెలిపారు. సర్కిల్ పరిధిలోని పన్ను చెల్లింపుదారుల నుండి మంచి స్పందన లభించిందనీ తద్వారా రూ. 13.95 కోట్లు వసూలు అయ్యాయని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరం 2025-26తో పోల్చితే అప్పట్లో రూ.12.53 కోట్లు వసూలు అయితే ఈ సారి అదనంగా రూ.1.42 కోట్లు వసూలు అయ్యాయని ఆయన తెలిపారు. సమర్థవంతమైన ప్రణాళిక, పన్ను చెల్లింపుదారుల సహకారం, సిబ్బంది కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఎర్లీ బర్డ్ పథకం కింద ఆస్తి పన్నులు చెల్లించిన వారికి డిప్యూటీ కమీషనర్ కృతజ్ఞతలు తెలిపారు. పన్నుల వసూళ్ళలో ముఖ్య భూమిక పోషించిన వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది, కార్యాలయ సిబ్బందిని సమ్మయ్య అభినందించారు. పన్ను చెల్లింపుదారుల సహకారం, అధికారులు, సిబ్బంది సమన్వయం వల్లే సత్ఫలితాలు వచ్చాయనీ ఈ నేపథ్యంలో ముందు కూడా పన్ను వసూళ్ళలో మరింత వృద్ధి సాధించాలని ఆయన సూచించారు.

## నెల రోజులుగా న్యాయం కోసం పోరాడుతున్న నాదర్‌గుల్ కాసువాగు రైతులు

న్యాయం కోసం నిరసనలు కొనసాగిస్తున్న నాదర్‌గుల్ కాసువాగు రైతులు

**సరూర్‌నగర్, మే 1 ప్రభాతవార్త:** గత 30 రోజులుగా తమకు న్యాయం చేయాలని భూపోరాటం చేస్తున్న నాదర్‌గుల్ కాసువాగు రైతులకు ప్రభుత్వం నుండి స్పందన కరువైందని బిజెపి సీనియర్ నాయకుడు మంత్రి మహేష్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కాసువాగు భూముల రైతుల వద్దకు వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 613(119)లో ఉన్న 373.22 ఎకరాల్లో ఏళ్ళ తరబడి వ్యవసాయం చేసుకుంటున్న కాసువాగు రైతులు న్యాయం కోసం వంటావార్పుల తదితర కార్యక్రమాల ద్వారా నిరసనలు వ్యక్తం చేస్తూ పోరాటం కొనసాగిస్తున్నా ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. దీంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి కాసువాగు రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కాగా ముందు అన్ని రాజకీయ పార్టీ లు, ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటాలు ఉధృతం చేస్తామని కాసువాగు రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, మే 1 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ ఎం.నిఖిల్ తెలిపారు. ఉప్పల్ స్వరూప్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ ఖల్సా, సౌత్ స్వరూప్‌నగర్, కెకెఆర్ గార్డెన్, గాంధీనగర్, అంబేద్కర్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం పదిన్నర నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ తెలిపారు.

ఉప్పల్ భగాయత్ పరిధిలో.. ఉప్పల్ భగాయత్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెచ్ఎండిఏ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ భగాయత్, కాల భైరవ దేవాలయం, టిఎస్ఆర్ లేన్, నారాయణ స్కూల్ , ఎజిఆర్ ప్రాజెక్ట్ , ఆత్మ గౌరవ భవనాలు, ఫేజ్ 3 పరిసర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## విద్యతోపాటు క్రీడల పై ఆసక్తి పెంచుకోవాలి : ఎసిపి

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**ఎల్.బి.నగర్, మే 1 ప్రభాతవార్త:** విద్యాతో పాటుగా క్రీడారంగంలో విద్యార్థులు రానించి ఉత్తమ పౌరులుగా ఎధగలని ఎల్బినగర్ ఏసిపి కృష్ణయ్య పేర్కొన్నారు. నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేడ్చల్ జిల్లా యువజన క్రీడల అధికారి, నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం, కాలెజ్ విద్యా కమిటి ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యా బోధనతో పాటు క్రీడారంగంలో ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాల మైదానాలు, కాలనీ ల్లోని ఖాళీ ప్రదేశాలలో క్రీడలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగోలే సిఐ మక్బుల్‌జానీ, క్యాంప్ స్పాన్సర్, నాగోల్ కాలెజి విద్య కమిటీ చైర్మన్లు చంద్రశేఖర్‌ఆజాద్, నోసా అధ్యక్షులు కందికంటి కన్నగౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సత్యనారాయణ, జగదీశ్వర్, సాయిబాబా, నాయకులు బద్దం వెంకటేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, అనంతుల శ్రీనివాస్‌రెడ్డి, మెందు వెంకట్‌రెడ్డి, పాఠశాల పిడిలు మల్లికార్జున్, శంకర్‌నాయక్, మమత, హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె లింగంగౌడ్ పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

ఉప్పల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 1 ప్రభాతవార్త :** వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహపడతాయని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసిన దూదేకుల సంఘం నేతల కృషి అభినందనీయమన్నారు. రహదారిపై వెళ్లే ప్రజల కోసం ఇంకా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి విషయమని అన్నారు. ఉప్పల్ ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సల్ల ప్రభాకర్ రెడ్డి, దూదేకుల సంఘం నేతలు నాగూర్ బాషా, పిరాంబీ, పకీరయ్య, సిద్దయ్య, హుస్సేన్, పెద్ద పిరయ్య, చిన్న పిరయ్య, పిరయ్య, కాసిం వల్లి, సిద్ధమ్మ, రామ్ రెడ్డి, రాజు, చిన్న పిరయ్య, పెంచులమ్మ, మల్లికార్జున్, దుర్గయ్య, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.